నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 20 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

సంస్థాన్‌నారాయణపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- సంస్థాన్‌నారాయణపురంలో అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీ

సంస్థాన్ నారాయణపురం, జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు కృషి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. సంస్థాన్ నారాయణపురంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను కలెక్టర్ హనుమంతు కె.జెండగే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో యూనిఫామ్, పుస్తకాలు అందజేసినట్లు చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని, అందుకు సంబంధించి బడ్జెట్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలపై ఆరా తీశారు. ఇప్పటికే తాసీల్దార్లకు ధరణి సమస్యల పరిష్కారం కోసం లాగిన్‌లు ఇచ్చామని, భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తాసీల్దార్లు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి, ఎంఈఓ నాగవర్ధన్, తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్‌కూమార్, ఏపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను వేగంగా పరిష్కరించాలి

చౌటుప్పల్ : ధరణి పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. బుధవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 5 మండలాలకు చెందిన సుమారు 400 ధరణి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఇందుకోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఏఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

- మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ సెక్రటరీ నరేశ్

చేనేత చిటికీని పరిశీలిస్తున్న అధికారులు ఆకునూరి నరేశ్, అరుణ్ కుమార్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 19 : చేనేత వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ సెక్రటరీ ఆకునూరి నరేశ్ అన్నారు. భూదాన్ పోచంపల్లిని బుధవారం ఆయన సందర్శించారు. చేనేత కార్మికుల స్థితిగతులు, మార్కెటింగ్ విషయాలను తెలుసుకున్నారు. స్థానిక శ్రీరంజన్ రీడింగ్ యూనిట్‌ను పరిశీలించారు. చేనేత మగ్గాలు, చిటికీ పరిశ్రమ, రంగుల అద్దకం, వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం టై అండ్ డై అసోసియేషన్ భవనంలో చేనేత వ్యాపారులు, చేనేత కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికులు, చేనేత వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. చేనేత సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్ర మంత్రిత్వ శాఖకు నివేదికను అందజేస్తానని తెలిపారు. గతంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ అడిషనల్ సెక్రటరీ అండ్ ఫైనాన్స్ అడ్వైజర్ హర్షిత్ గోపాల్‌కు చేనేత వ్యాపారస్తులు అందించిన మెమోరాండాన్ని పరిగణలోకి తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించడానికి ఆయన ఆదేశాల మేరకు పోచంపల్లికి వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చేనేతకు సంబంధించిన ప్రింటింగ్ చీరలను అరికట్టాలని, వ్యాపారస్తులకు ముద్ర రుణాలు ఇవ్వాలని, నూతన డిజైన్లలో సహకారం, ఐఐహెచ్‌టీ కాలేజ్ ఏర్పాటు చేయాలని ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్ కుమార్, జిల్లా చేనేత సహాయ సంచాలకుడు విద్యాసాగర్, చేనేత సహకార సంఘ పర్సనల్ ఇన్‌చార్జి ప్రసాద్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత నాయకులు ఎన్నం శివకుమార్, కర్నాటి బాలరాజు, ముస్కూరి నరసింహ, గంజి బాలరాజు, వనం దశరథ, సీత సుధాకర్, అంకం పాండు, చింతకింది రమేశ్, కర్నాటి పురుషోత్తం, వేముల నరేశ్, కందగట్ల శంకరయ్య, సీత భవాని పాల్గొన్నారు.

రామానంద తీర్థలో సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, జూన్ 19 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిర్వహించే సాంకేతిక శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్-ట్యాలీ (బీకాం పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), ఆటోమొబైల్ టూవీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ (పదో తరగతి పాస్), ఎల్టక్షీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్, సర్వీస్ (టెన్త్ పాస్) కోర్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ నెల 27న అడ్మిషన్లకు చివరి తేదీ అని, 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జీరాక్స్ సెట్, పాస్ ఫొటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కరెంట్ అంటేనే కేసీఆర్!

- అన్ని కేటగిరీలకు నిరంతర విద్యుత్
- నాణ్యమైన కరెంట్ సరఫరాకు ప్రాధాన్యం
- రాష్ట్రం పట్ల చిత్తశుద్ధితోనే సాధ్యమైంది
- విద్యుత్ వెలుగులపై ప్రజల మనోగతం

ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌తోనే కరెంట్ కష్టాలకు చెక్

నల్లగొండ ప్రతినిధి, జూన్19(నమస్తే తెలంగాణ) : సమైక్య పాలనలో కరెంట్ అంటేనే కన్నీటి వ్యథలకు రూపం. మూడు గంటలిస్తే ఆరు గంటల కోతలు. ఇచ్చిన దానిలోనూ సింగిల్ ఫేజే ఎక్కువ సమయం. ఇక త్రీఫేజ్ కరెంట్ ఇస్తే దఫదఫాలుగా వచ్చేది. దాంతో పొలం వద్ద ఉన్న రైతులకు కంటి మీద కునుకు ఉండేది కాదు. కార్కానాల ఉండే కార్మికుడికి పని దొరికేది కాదు. ఇక కరెంట్ మీద ఆధారపడే చిరు వ్యాపారస్తులకు చుక్కలు కనిపించేవి. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి కాంగ్రెస్ పాలకుల కరెంట్ సరఫరా ఇట్లుంటదని కేసీఆర్ అప్పుడే చెప్పారు. కోతలు లేని నాణ్యమైన కరెంట్ రాష్ట్రం సాధించాక తెచ్చుకుందామంటూ ప్రజలకు మాటిచ్చారు. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి సీఎంగా కేసీఆర్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రానికి అవసరమైన కరెంట్‌పై ప్రణాళికలు సిద్ధం చేశారు. ఓ వైపు రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లపై దృష్టి సారిస్తూనే తక్షణమే కరెంట్ ఇబ్బందులకు చెక్ పెట్టేలాగా ఇతర రాష్ట్రాల నుంచి కరెంట్ తెచ్చుకునేలా మరోవైపు కేంద్రీకరించి పనిచేశారు. వీటన్నింటి ఫలితంగానే ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడుతూ 2018 జనవరి 1 నుంచి వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. గృహావసరాలకు, తర్వాత పరిశ్రమలకు సైతం 24 గంటల కరెంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇలా ఇచ్చే కరెంట్‌లోనూ తరుచూ అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన కరెంట్ వివిధ వర్గాల ప్రజలకు అందించేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఓహెచ్ లైన్ల విస్తరణ, ఎల్‌టీ లైన్ల నిర్మాణం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల వంటివాటి కోసం ఒక్క నల్లగొండ జిల్లాలోనే సుమారు రూ.1100 కోట్లను వెచ్చించారు. దాంతో గృహ, వ్యవసాయం, పరిశ్రమలకు సైతం నిరంతరం నాణ్యమైన కరంట్ సరఫరా జరిగింది. ఎక్కడన్నా సాంకేతిక సమస్యలు మినహా విద్యుత్ కోతలు ఉండేవి కావు. పరిశ్రమల్లో మూడు షిఫ్టుల్లో పనిచేసినా ఇబ్బందిలేకుండా కరెంట్ ఇవ్వడంతో ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. కుటీర, మధ్యతరహా, భారీ పరిశ్రమలు నిరంతరం పనిచేసేందుకు కరెంట్ దోహదపడింది. దాంతో సమైక్య పాలన నాటి చీకట్లు తొలగి ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరించేలా కేసీఆర్ అవలంబించిన విద్యుత్ విధానాలు ఉపకరించాయనడంలో సందేహం లేదు. అందుకే ప్రజల్లో సైతం కరెంట్ అంటే కేసీఆర్... కేసీఆర్ అంటే కరెంట్ అనేంత క్రేజ్ వచ్చింది. అట్లాంటి కేసీఆర్ ప్రారంభించిన నిరంతర కరెంట్‌కు మరకలు రుద్దే ప్రయత్నాలు జరుగుతుండడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్‌పై కరెంట్ అభాండాలు వేసేలా కుట్రలు జరుగడం సరికాదంటున్నారు. కాంగ్రెస్ పాలకులు వీలైతే అంతకు మించి మరింత సమర్థవంతంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేసి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలుకుతున్నారు. అంతేకానీ దేశంలోనే ఎక్కడా వీలుకాని విధంగా అన్ని రంగాలకు నిరంతర కరెంట్ సరఫరా ఇచ్చి సరికొత్త చరిత్ర లిఖించిన కేసీఆర్‌పై కక్ష్య సాధింపు సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

24 గంటల కరెంటుతో మిల్లులు మెరుగుపడ్డాయి

సమైక్య పాలనలో చిన్నతరహా పరిశ్రమల పరిస్థితి అధ్వానంగా ఉండేది. యువత బ్యాంక్ రుణాలు తీసుకొని మండలంలో పాలిష్, ముగ్గుమిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. 2014కు ముందు కరెంటు కష్టాలు విపరీతంగా ఉండేవి. రోజుకు 6 గంటలు కూడా కరెంటు వచ్చే పరిస్థితి లేకుండె. వారానికి ఒకరోజు హాలిడే ప్రకటించారు. మిల్లుల్లో పనిచేసే కార్మికులకు పని లేకుండా పోయింది. కరెంటు సరిగా లేక మిల్లులు మూతపడేస్థితికి చేరాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇవ్వడంతో మిల్లులు మెరుగుపడ్డాయి. కరెంటు కోతలు లేకుండా రోజంతా మిల్లులు నడిచాయి. నాటి కరెంటు కరువు పరిస్థితుల నుంచి చిన్న పరిశ్రమలకు కరెంటు ఇచ్చి ఆదుకున్న కేసీఆర్‌ను నేడు నిందించడం సరికాదు.

-పడిగెపాటి శ్రీనివాస్‌రెడ్డి, పాలిష్‌మిల్ యజమాని, దామరచర్ల

కేసీఆర్‌ను నిందించడం కరెక్ట్ కాదు

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను బద్నాం చేయడం సరి కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు అరిగోసలు పడేవారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతుల గోడు తీర్చేందుకు 24 గంటల నిరంతర కరెంట్ సరఫరా చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలన రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌ను నిందించడం కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కొలువైన నాటి నుంచి ఇప్పటివరకు రోజులో కనీసం 15 గంటల త్రీఫేజ్ కరెంటు ఇచ్చిన దాఖలాలు లేవు. కేసీఆర్ మాత్రం చిన్న, సన్నకారు రైతులతోపాటు పరిశ్రమలకు ఇబ్బందులు కలుగకుండా కరెంట్ సప్లయ్ చేశారు. అలాంటి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు బురదజల్లడం సరి కాదు.

- వల్లమల్ల బాలస్వామి, రైతు, మొల్కపట్నం, వేములపల్లి మండలం

బీఆర్ఎస్ పాలనలో 24 గంటలు కరెంట్ వచ్చేది

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 24 గంటలపాటు కరెంట్ ఉండేది. చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా లభించేది. ఆ సమయంలో మాకు బోర్ల రిపేర్ గిరాకీ తక్కువగా ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోటర్ రిపేర్ల గిరాకీ పెరిగింది. కరెంట్ సరైన సమయంలో రాకుండా ఉండడం, అలాగే అధికారులకు అవగాహన లేక కుంటలు, చెరువులను నింపకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లు పోయక మోటర్లు కాలిపోతున్నాయి. సరైన సమయంలో కరెంట్ ఇవ్వకపోవడంతో మోటర్లు కాలిపోయి రిపేర్ల గిరాకీ పెరిగింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి దేశానికి వెన్నెముక అయిన రైతుల సమస్యలను పరిష్కరించాలి.

-కోదాటి నరేందర్, మోటర్ మెకానిక్, కుక్కడం, మాడ్గులపల్లి మండలం

కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెల్వట్లే..

మా గ్రామం ఎన్‌హెచ్-565పై ఉండడంతో రోడ్డు వెంటనే బైక్ సర్వీసింగ్‌తో పాటు పంచర్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నా. కరెంట్ ఉంటేనే నా పని సాగుతుంది. కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు కరెంట్ ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెల్వట్లేదు. రోజులో పదిసార్లు కరెంట్ పోతుంది. కరెంట్ ఉన్నంత సేపు బైక్ సర్వీసింగ్, వాటర్ సర్వీసింగ్ చేస్తున్నా. కరెంటు సరిగా ఉండకపోవడంతో పంచర్ల గిరాకీ కూడా తగ్గి ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో బతుకు భారంగా మారింది. ఇప్పటికైనా 24గంటల కరెంటు ఉండేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

- నారగోని జానయ్య, బైక్ మెకానిక్, చిన్నసూరారం, నల్లగొండ మండలం

నందనం నీరా ప్లాంట్ ప్రారంభమెప్పుడో..?

- బీఆర్ఎస్ హయాంలోనే ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్రంలోనే తొలిసారిగా మన దగ్గరే యూనిట్
- గతేడాది ఆగస్టులోనే భవన నిర్మాణం పూర్తి
- ఇప్పటికే పూర్తయిన ఆధునిక యంత్రాల అమరిక
- సిద్ధంగా ఉన్నా చొరవ తీసుకోని ప్రజాప్రతినిధులు
- అందుబాటులోకి వస్తే ఎన్నో విధాలుగా మేలు

అధికారంలోకి వచ్చాక పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

కల్లు గీత కార్మికుల జీవన స్థితిగతులు మార్చే నందనం నీరా ప్లాంట్‌ను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. నీరా కేంద్రాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలోనే భవనం, యంత్రాలతోపాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, సిద్ధంగా ఉంచినా అందుబాటులోకి తీసుకురాకుండా చోద్యం చూస్తున్నది. ఇది ప్రారంభమైతే నీరాను ప్రాసెస్‌తోపాటు స్టోరేజీ, ప్యాకింగ్ ఇక్కడే చేయనున్నారు. ఇతర ప్రాంతాలకు నీరాను సరఫరా చేయనున్నారు. అంతేకాకుండా ఇక్కడే తాటి ఉత్పత్తులు తయారు కానున్నాయి.

– యాదాద్రి భువనగిరి, జూన్ 19 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మండలం నందనంలోని నీరా ప్లాంటు

నాడు రూ.8 కోట్లు విడుదల

1993 నవంబర్ 13న అప్పటి ఆబ్కారీ శాఖ మంత్రి గాదె వెంకట్‌రెడ్డి, నాటి వ్యవసాయ శాఖ మంత్రి కె. జానారెడ్డి నందనం గ్రామంలో రూ. 70లక్షల అంచనా వ్యయంతో తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. దశాబ్దాలుగా మూతబడిన నందనం తాటి ఉత్పత్తుల కేంద్రంలో నీరా ప్లాంట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ సర్కారు సంకల్పించింది. ఆరోగ్యానికి మేలు చేసే నీరా ఉత్పత్తి ద్వారా గీత వృత్తిదారులను ఆదుకోవాలని నాటి సీఎం కేసీఆర్ భావించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు నీరా అందుబాటులోకి తేవాలని అనుకున్నారు. ఇందులో భాగంగా తాటి వనాలు అధికంగా ఉన్న భువనగిరి మండలంలోని నందనంలో నీరా ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాలుగు ఎకరాల్లో భవనం నిర్మించేందుకు రూ. 8 కోట్లను విడుదల చేశారు. 2022 జూలై 29న అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నీరా కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు వేగవంతంగా కొనసాగాయి. గతేడాది ఆగస్టులోనే భవన నిరాణాల పనులన్నీ పూర్తయ్యాయి. దాంతో రాష్ట్రంలోనే తొలిసారిగా నీరా ఉత్పత్తి కేంద్రం నందనంలో ఏర్పాటైంది.

ఆధునిక యంత్రాలు ఏర్పాటు

నీరాను ఉదయాన్నే చెట్టు నుంచి తీసి నందనం ప్లాంట్‌కు తీసుకొస్తారు. ఇది నీరా నుంచి కల్లుగా మారకుండా ఇక్కడే ప్రాసెస్ చేస్తారు. ప్రతి రోజూ రెండు వేల లీటర్ల నీరా కేంద్రానికి వచ్చే అవకాశం ఉంది. దీన్ని ఇక్కడే నిల్వ చేస్తారు. ఇది పులియకుండా, పాడవకుండా పాశ్చరైజేషన్ చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక టెక్నాలజీతోపాటు అత్యాధునిక యంత్రాలు అవసరం. గతేడాది ఆగస్టు నుంచే భవనం అందుబాటులోకి రావడంతోపాటు యంత్రాల అమరికను ప్రారంభించారు. అప్పటి నుంచి వివిధ రకాల మిషన్లను ఇన్‌స్టాల్ చేస్తూ వచ్చారు. ప్రస్తుతం కేంద్రంలో అన్ని రకాల మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఒకట్రెండు మైనర్ పనులు మినహా అంతా సిద్ధంగా ఉంది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీన్ని పెద్దగా పట్టించుకోవడంలేదు. ఆరు నెలలైనా దీనిపై కనీసం రివ్యూ చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే సందర్శించలేదు. కేంద్రం అందుబాటులోకి వస్తే ఇక్కడి నుంచే ప్యాక్డ్ నీరాను హైదరాబాద్ కేఫ్‌తోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. సేకరణ, స్టోరేజీలు, ప్యాకింగ్, రవాణా నందనం నుంచే జరుగనుంది.

ఎన్నో విధాలుగా మేలు..

నందనం ప్లాంట్‌లో నీరాతోపాటు నీరా అనుబంధ ఉత్పత్తులను కూడా తయారు చేయనున్నారు. నీరాను ఆవిరి పట్టించడం ద్వారా ఇతర ఉత్పత్తులు తయారు చేస్తారు. ఒక్కో ఉష్ణోగ్రత వద్ద ఒక్కో ఉత్పత్తి వస్తుంది. తాటి బెల్లం, చక్కెర, చాక్లెట్లు, తేనె లాంటి 18రకాల వస్తువులను తయారు చేసే అవకాశం ఉంది. ప్రకృతి సిద్ధంగా వచ్చిన నీరాతో తయారు చేసిన వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. నీరాలో ఎన్నో రకాల ప్రొటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, లవణాలు, జింక్, సోడియం, పొటాషియం తదితర విటమన్లు, పోషకాలు ఉంటాయి. షుగర్ ఉన్నోళ్లు సైతం దీన్ని సేవించవచ్చు. కిడ్నీ రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇక తాటి ఆకులతో అలంకరణ వస్తువులు తయారు చేయవచ్చు.

నీరా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

గీత కార్మికుల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన నీరా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. నీరా కేంద్రం సాధనకు ఎన్నో పోరాటాలు చేశాం. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలి. చిరకాల స్వప్నంగా మిగిలిన నీరా కేంద్రాన్ని ప్రారంభిస్తే ఈప్రాంత గీత కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

-మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు

ఆరు నెలలైనా అమలు కాని కాంగ్రెస్ హామీలు

దేవుళ్లపై ఒట్లు వేసి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్

- ఏడాదికి ఎకరాకు రూ.15 వేల రైతు బంధు హామీ ఏమైంది?
- డిసెంబర్ 9న రుణమాఫీ అమలు వాగ్దానం ఎక్కడ పోయింది?
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, జూన్ 19 : దేశంలో ఏ ప్రజాప్రతినిధి గానీ, సీఎంలు గానీ దేవుళ్లపై ప్రమాణం చేయలేదని, కేవలం రేవంత్‌రెడ్డి ఒక్కడే దేవుళ్లపై ఒట్లు పెట్టి వారిని కూడా మోసం చేశాడని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎద్దేవా చేశారు. నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఎక్కడ పోయిందని విమర్శించారు. ఏడాదికి ఎకరాకు రూ.10 వేలు ఉన్న రైతుబంధు రూ.15వేలు చేస్తానని ఇచ్చిన హామీ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 6 నెలలలైనా ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. 70శాతం మందికి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రూ.99వేల వరకు రుణమాఫీ చేశామని, మరో 30శాతం మందికి మాత్రమే రుణమాఫీ మిగిలిందని, వారికి మాఫీ చేసేందుకు మంత్రులతో, అధికారులతో పత్రికల్లో ఆగస్టు లోపు మాఫీ చేస్తామని రాయించడం తప్ప ఆచరణలో లేదన్నారు. అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, హోంగార్డులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఆంక్షలు పెడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్సే అన్నారు. రైతు రాజులాగా బతకాలని సీజన్ ప్రారంభం కాకముందే పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. 24 గంటల కరెంటుతోపాటు ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే ప్రక్రియ చేపట్టి వ్యవసాయానికి పెద్దపీట వేసిన ఘనత ప్రపంచంలో కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టకుండా ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై ఏ విధంగా కేసులు పెట్టాలి, జైలుకు ఎలా పంపాలనే ఆలోచన తప్ప కాంగ్రెస్‌కు మరొకటి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిటిషన్ ఇచ్చే పరిస్థితి లేదని, 100కు డయల్ చేసినా ఫలితం లేదని, ఏ ఊరు నుంచి అయితే ఫోన్ వస్తుందో.. ఆ ఊరి కాంగ్రెస్ లీడర్‌ను అడిగి రావాలా? వద్దా ? అన్న ఆలోచనలో పోలీస్ యంత్రాంగం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ బయటనే ఫొటోలు తీసుకుని ఏ పార్టీ అని అడిగి లోపలికి రానిచ్చే పరిస్థితి నకిరేకల్‌లో ఉందన్నారు. అధికార పార్టీకి తొత్తులుగా మారి న్యాయాన్ని అన్యాయం చేయొద్దన్నారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఏ విధమైన అరాచకాలు సాగుతున్నాయో చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షుడు నవీన్‌రావు, వెంకట్‌రెడ్డి, నాయకులు నడికుడి వెంకటేశ్వర్లు, రాచకొండ వెంకన్న, గుర్రం గణేశ్, దైద పరమేశం, కౌన్సిలర్ రాచకొండ సునీల్ పాల్గొన్నారు.